క్లుప్తంగా...

నేడు బల్కంపేట అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు బోనం

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు, బంగారు బోనాన్ని సమర్పించనున్నారు. ఈ విషయాన్ని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ తెలిపారు. గౌలిపురాలోని శ్రీ మహంకాళి ఆలయం నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పిస్తామని వెల్లడించారు.

తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాలు



చార్మినార్: మహారాష్ట్ర తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాల జాతరను పాతబస్తీ డబీర్‌పురాకు చెందిన అమ్మవారి భక్తులు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. డబీర్‌పురా పంచదుర్గ ఆలయానికి చెందిన బోనాల ఉత్సవాల నిర్వాహకులు నక్క మహేందర్ గౌడ్, ప్రభావతి, ఎల్.ప్రేం కుమార్, ఆనంద్‌లాల్ తదితరులు మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు వెళ్లారు. అక్కడి తుల్జా భవాని అమ్మవారికి బోనాలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారి ఘటం, తొట్టెల ఊరేగింపుతో బోనాల జాతరను కనుల పండువగా నిర్వహించారు.

జంగల్ విఠోభా ఆలయ రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



అఫ్జల్‌గంజ్: జంగల్ విఠోభా ఆలయ రథోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ గౌంటి శంకర్ యాదవ్, అధ్యక్షుడు కిషన్‌యాదవ్ తెలిపారు. శ్రీ విఠలేశ్వర బాలభక్త సమాజం ఆధ్వర్యంలో ఈనెల 28న ప్రారంభమయ్యే ఉత్సవాలు వచ్చే నెల 6వ తేదీ వరకూ కొనసాగుతాయని వెల్లడించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శంకర్‌యాదవ్, కిషన్‌యాదవ్, మానిక్ రావు, పాండూయాదవ్, బోయినీ వెంకటేష్ యాదవ్, రాజు మమరాజ్ తదితర ప్రతినిధులతో కలిసి సోమవారం ఆలయ ప్రాంగణంలో కరపత్రాలు, గోడ పత్రులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈనెల 28న పంచామృత అభిషేకం, హారతి, కలశపూజ, దీపారాధన, ఇతర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 29న ప్రత్యేక పూజాధికారాలు, ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు జనార్దన్, శ్రీకాంత్‌గౌడ్, ఆనంద్ యాదవ్, విశాల్ గలీబే పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

గన్‌ఫౌండ్రీ: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరూ స్పందించకపోవడం బాధాకరమని జాతీయ క్రిష్టియన్ బోర్డు చైర్మన్ జాన్‌మస్కీ అన్నారు. సోమవారం లక్డీకాపూల్‌లోని అశోక హోటల్‌లో జాతీయ క్రిష్టియన్ బోర్డు ఆధ్వర్యంలో దక్షిణ భారత రాజకీయాలలో క్రైస్తవ పాత్ర అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 20శాతం పైగా ఉన్న క్రైస్తవులు తమ హక్కులను ఐక్యంగా ఉంటేనే సాధించుకోగలుగుతారని తెలిపారు. క్రిష్టియన్ బోర్డుకు రాజ్యాంగబద్ధ హోదాను కలించాలని కోరుతూ జూలై 5న రాష్ట్రపతిని కలువనున్నట్లు వెల్లడించారు.

లిడ్‌క్యాప్ వృత్తులకు ముద్రా రుణాలు ఇవ్వాలి



జియాగూడ: జియాగూడలో లిడ్‌క్యాప్ పరిశ్రమలు పునరుద్ధరించడానికి ముద్రా రుణాలు అందజేయాలని జియాగూడ దోర్‌బస్తీ వీరశైవ కక్కయ్య సమాజ్ అధ్యక్షుడు దత్తుపోల్, కమిటీ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సోమవారం జియాగూడలో ఇంటింటికీ బీజేపీ ప్రచారం కార్యక్రమంలో భాగంగా డోర్ సమాజ్ ప్రతినిధులు గుజరాత్ ఎంపీ భారతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..35 ఏళ్ల క్రితం జియాగూడ దోర్‌బస్తీలో ప్రభుత్వ లిడ్‌క్యాప్ సంస్థ ద్వారా శిక్షణలు ఇచ్చి ఉపాధికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఉపాధ్యక్షుడు సురేష్ గజిరే, ప్రధాన కార్యదర్శి జి.రాజేందర్, కోశాధికారి, కరణ్ ఓట్కర్, సలహాదారులు ఉమేష్ ఓట్కర్, చైర్మన్ భగవాన్‌దాస్ చౌగ్లే పాల్గొన్నారు.

బక్రీద్‌కు సర్వం సిద్ధం

- నగరంలో మొదలైన బక్రీద్ సందడి
- త్యాగానికి ప్రతిరూపం బక్రీద్
- జోరందుకున్న పొట్టేళ్లు, మేకల విక్రయాలు



ఖుర్బానీకి సిద్ధంగా ఉన్న పొట్టేళ్లు, మేకలు

చార్మినార్: పాతబస్తీలో బక్రీదు సందడి మొదలైంది. ఈనెల 29న ముస్లిం సోదరులు బక్రీద్‌ను ఘనంగా జరుపుకోనున్నారు. ఆయా ప్రాంతాల ముస్లిం ప్రజలు తమకు కావాల్సిన గొర్రెలు, మేకలను ఖరీదు చేస్తున్నారు. త్యాగానికి మరో పేరుగా నిర్వహించుకునే ఈ బక్రీదు కోసం గ్రేటర్ శివారు జిల్లాల నుంచి గొర్రెలు, మేకలు పాతబస్తీకి తరలివచ్చాయి. పాతబస్తీలోని ప్రధాన కూడళ్లలో గొర్రెలు, మేకలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. గతేడాది కన్నా ఈసారి రేట్లు అధికంగా ఉంటాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. బరువుకు అనుగుణంగా వీటి రేట్లుంటాయి.

ఇస్లామిక్ చరిత్రలో ఇబ్రహీంది ప్రముఖ స్థానం..

ముస్లింలకు ప్రధానంగా ఏడాదికి రెండే రెండు పండుగలు రంజాన్, బక్రీద్. అల్లాహ్‌పై భక్తికి రంజాన్ ప్రతిరూపమైతే..త్యాగానికి ప్రతిరూపం బక్రీద్. ఆరాధించే అల్లాహ్ కోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని నాటి ప్రవక్త ఇబ్రహీం (అ), ఇస్మాయిల్ (అ)ల త్యాగనిరతిని ఈ బక్రీద్ పండుగ గుర్తు చేస్తుంది. బక్రీద్‌ను 'ఈద్–ఉల్–అజీహా'అని కూడా అంటారు. ఇస్లామిక్ చరిత్రలో ఇబ్రహీంది ప్రముఖ స్థానం. అల్లాహ్ పెట్టిన పరీక్షలలో అన్నింటిలో నెగ్గిన ప్రవక్త ఇతను. ఓ సారి ఇబ్రహీంను తన పేర అతని కుమారుడు ఇస్మాయిల్‌ని బలివ్వాలని ఆదేశిస్తాడు. అల్లాహ్ ఆదేశానుసారం మానవ బంధుత్వాలకతీతంగా ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధమవుతాడు. తండ్రి మాట ప్రకారం అల్లాహ్ కోసం ప్రాణత్యాగానికి ఇస్మాయిల్ సిద్ధమవుతాడు. స్వయంగా తన కుమారుడిని బలివ్వడానికి సిద్ధమైన ఇబ్రాహీం త్యాగాన్ని అల్లాహ్ మెచ్చుకొని కుమారుడి బదులు ఓ జీవాన్ని బలివ్వాలని కోరడం.. ఆరోజు నుంచి ఆనవాయితీగా బక్రీద్ రోజు ఖుర్బానీ ఇవ్వడం జరుగుతోంది. ఇస్లాం మూల స్తంభాలలో హజ్ కూడా ఇదే రోజు చేస్తారు. ఆర్థికంగా బాగున్న ప్రతి ముస్లిం ఖుర్బానీ ఇవ్వడం అతని విధి. పొట్టేల్, మేకలు, ఆవులు, దూడలతో పాటు ఒంటెలను ఖుర్బానీ ఇవ్వడం జరుగుతోంది.

మూడు భాగాలుగా ఖుర్బానీ మాంసం...

ఖుర్బానీ ఇచ్చే వారికి ముఖ్యంగా వడ్డీతో కూడిన అప్పు ఇవ్వరాదు.. తీసుకోరాదు. చిన్నజీవాలను వ్యక్తిగతంగా, పెద్ద జీవాలను ఏడుగురు భాగస్వాములై ఉండాలి. అల్లాహ్ పేర బలిచ్చిన ఈ జంతువుల మాంసాన్ని మూడు సమాన భాగాలను చేయాలి. దీంట్లో ఒకభాగం ఖుర్బానీ ఇస్తున్న వారు తీసుకొని.. రెండో భాగాన్ని తమ బంధువులకు.. మూడో భాగాన్ని పేద ముస్లింలకు పంచాలి. బలిచ్చే జంతువులకు శరీర భాగాలలో ఎలాంటి లోపం ఉండరాదు.

మార్కెట్‌లో బక్రీద్ సందడి..

గోల్కొండ: మార్కెట్‌లో బక్రీద్ సందడి నెలకొంది. మెహిదీపట్నం, టోలిచౌకి, గోల్కొండ తదితర ప్రాంతాలు గొర్రెల అమ్మకాలతో సందడిగా మారాయి. బక్రీద్ రోజు గొర్రెలను ఖుర్బానీగా ముస్లింలు ఇస్తారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి సైతం గొర్రెలను ఇక్కడికి తెస్తున్నారు. కాగా ఈసారి గతంలో కంటే ఎక్కువ గొర్రెలు మార్కెట్‌లో అమ్మడానికి వచ్చే అవకాశం ఉందని గొర్రెల వ్యాపారి మక్బూల్ అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఒక సంవత్సరం పైబడ్డ గొర్రెలనే ఖుర్బానీ ఇవ్వడానికి కొంటారు. దీనికి అనుగుణంగా అమ్మకానికి వస్తాయి. ఒక సంవత్సరం వయస్సు గల గొర్రె రూ.11 వేల నుంచి 12 వేలకు లభిస్తుంది. కాగా తెలంగాణ గొర్రెలతో పాటు కర్ణాటక నుంచి వచ్చిన గొర్రెలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది.

కత్తులు, పీటలకు గిరాకీ....

బక్రీద్ సందర్భంగా కత్తులు సానబెట్టే వారికి బాగా గిరాకీ ఉంటుంది. పండగకు 4 రోజుల ముందు నుంచి నగర శివారు ప్రాంతాలతో పాటు నాందేడ్ నుంచి కూడా కత్తులకు సానబెట్టే వారుకు కచ్చితంగా బక్రీద్‌కు వస్తారు. వివిధ రకాల కత్తులు సైతం వీరు అమ్మకానికి పెడుతారు. మాంసం కోయడానికి ఉపయోగించే పీటలు కూడా అమ్మకానికి పెట్టారు.



కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసీవుల్లా, ఎమ్మెల్యే కౌసర్

ఈద్గాలు ముస్తాబు...

గోల్కొండ: నగరంలోని ఈద్గాలకు బక్రీద్ పండగ కోసం తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే కౌసర్‌తో కలిసి గోల్కొండ సమీపంలోని కుతుబ్‌షాహీ ఈద్గా, ఒవైసీ గ్రౌండ్‌లోని ఈద్గా, పెన్షన్‌పురా ఈద్గాలను సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి కుతుబ్‌షా ఈద్గాను సందర్శించారు. బక్రీద్, రంజాన్ పండగల సందర్భంగా ఈ ఈద్గాలకు వచ్చే వారికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వక్ఫ్‌బోర్డు కృషి చేస్తుందని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఈద్గా కమిటీ అధ్యక్షులు గులాం మొయినుద్దీన్‌ఖాన్ పాషాభాయ్, మజ్లిస్ నాయకులు ఉన్నారు.



పాతబస్తీలో నెలకొన్న సందడి



టోలిచౌకి వద్ద గొర్రెల అమ్మకాలు



కత్తులు సానబడుతున్న దృశ్యం

పురస్కారం ప్రదానం



పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న శ్రీధర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. సోమవారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సాహితీవేత్త ఎస్.శ్రీరంగచార్యకు ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య స్మారక ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను గుర్తు పెట్టుకుని వారిని సన్మానించడం ఎంతో అభినందనీయమన్నారు. సాహితీవేత్తలు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, గిరిజన మనోహరబాబు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.భూమయ్య, కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర సంఘ భవనానికి స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం బడిచౌడిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వేల సంఖ్యలో తమ సంఘానికి అన్ని శాఖల ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు అటెండర్ స్థాయి నుంచి గ్రూప్–1 స్థాయి వరకు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

న్యాయవాదుల నిరసన



చార్మినార్: 1975 జూన్ 25 ఎమర్జెన్సీ డే సందర్భంగా సోమవారం హైకోర్టు గేటు ఎదుట భారత ప్రజా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. ప్రశ్నించే వారికి ప్రతిరోజూ ఎమర్జెన్సీ కాలం మారిపోయిందన్నారు. ఉపా లాంటి నల్ల చట్టాలను న్యాయవాదులపై పెట్టి కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అనంతరం న్యాయవాదులు నల్ల చట్టాలను రద్దు చేయాలి.. అడ్వొకేట్స్‌పై పెట్టిన కేసులను ఎత్తివేయాలి.. ఉపా చట్టాని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వెంకన్న, సుశీల్ కుమార్, ప్రసాద్‌బాబు, సైదారావు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

సిక్వాల్ సమాజ్ శృంగ్‌రిషి విగ్రహాల ప్రతిష్ఠాపన



శోభాయాత్రలో కమల నాయందాస్‌జీ మహారాజ్, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సిక్వాల్ ప్రగతి సమాజ్ ఆధ్వర్యంలో శ్రీరాధాకృష్ణ వేదమాత గాయత్రి, శృంగ్‌రిషి మహారాజ్ విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జోరుగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరాల నడుమ వివిధ మఠాల పీఠాధిపతులు విగ్రహాలకు ప్రతిష్ఠాపన చేశారు. ముందుగా బేగంబజార్ ఫీల్‌ఖాన్ నుంచి పెద్ద ఎత్తున సిక్వాల్ సమాజ్ మహిళలు తలలపై కలశాలు పెట్టుకుని శోభాయాత్ర నిర్వహించారు. ఈ వేడుకలకు అయోధ్య నగరం పీఠాధిపతి కమలనాయందాస్ మహారాజ్, సచ్చిదానంద సరస్వతి మహాస్వామీజీ మహారాజ్, త్రిదండి స్వామి శ్రీల్ భక్తిభూషన్ బోధయాన్ మహారాజ్, దామోధర్ గోస్వామి మహారాజ్, డాక్టర్ సహదేవ్‌దాస్‌జీ, ప్రభుదాస్ మహారాజ్ పాల్గొని పూజలు చేశారు. గోషామహల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ నాయకులు విక్రమ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పూజ వ్యాస్ బిలాల్, గడ్డం శ్రీనివాస్ యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సిక్వాల్ సమాజ్ నాయకులు మోతీలాల్ తివారి, విష్ణుగోపాల్ తివారి, గన్‌శ్యామ్‌దాస్ ఉపాధ్యాయ, విజయ్‌పాండే, పవన్ వ్యానో పాల్గొన్నారు.



కలశ యాత్రలో పూజవ్యాస్ బిలాల్, ఇతర సిక్వాల్ సమాజ్ మహిళలు

మంత్రి కేటీఆర్‌ను కలిసిన సలావుద్దీన్ లోధీ



చార్మినార్: మంత్రి కేటీఆర్‌ను సోమవారం బీఆర్‌ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గంలో అమలవుతున్న పలు సంక్షేమ పథకాలను ఆయనకు వివరించారు. పార్టీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలను ఆయనకు తెలిపారు.

విజయశాంతికి 'అమ్మకు అక్షర నైవేద్యం' పుస్తకం అందజేత

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలతో విడదీయరాని అనుబంధమున్న సినీనటి విజయశాంతికి 'అమ్మకు అక్షర నైవేద్యం' పుస్తకాన్ని అందజేశారు. శ్రీ మహంకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరవింద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ సోమవారం బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిసి పుస్తకాన్ని అందజేశారు. తెలంగాణ సంస్కృతి, బోనాల విశిష్టత, లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారి మహత్యాన్ని వివరిస్తూ కవులు, పండితులు రాసిన 526 కవితలతో పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని ఆమె కొనియాడారు.



విజయశాంతికి పుస్తకాన్ని అందజేస్తున్న అరవింద్ గౌడ్, వెంకటేష్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా కలెక్టరెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, విశ్వ విద్యాలయాలలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు, విద్యార్థులకు తోపులాట జరగడంతో విద్యార్థులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెమిన్ గువెరా, కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలి

విజయనగర్‌కాలనీ: అక్రమ మార్గాన ఇంజినీరింగ్ సీట్లను బ్లాక్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్న కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీఎస్, ఓయూ జేఏసీ కోరింది. ఈ మేరకు సోమవారం విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పాట్ అడ్మిషన్ల పేరుతో సైతం అక్రమ దందా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవీన్‌యాదవ్, ప్రశాంత్, శ్రీనివాస్, సూర్యం, శ్రీశైలంగౌడ్, రాజేష్, శ్రీనివాస్‌గౌడ్, సైదులు, నాగయ్యగౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఆర్‌జేడీఎస్ఈతో టీఎన్జీఓ నేతలు భేటీ



విజయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీఓ నేతలు

నాంపల్లి: పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీఎస్ఈ) హైదరాబాద్ కార్యాలయం డీఈఓ కార్యాలయం నుంచి పక్కనే ఉండే సర్వశిక్షా అభియాన్ కార్యాలయంలోకి మారింది. ఈ సందర్భంగా ఆర్‌జేడీఎస్ఈ విజయలక్ష్మిని టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం.హుస్సేన్ నేతృత్వంలో డీఈఓ యూనిట్ కార్యవర్గం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలపైన ఆమెతో చర్చించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, సహాధ్యక్షులు డేవిడ్, కోశాధికారి ప్రేమ్, ఉపాధ్యక్షులు రవి, సంయుక్త కార్యదర్శి జయంతిరెడ్డి, నేతలు ముజాహిద్ పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి మటన్ క్యాంటీన్, మటన్ మార్కెట్

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్‌లో మటన్ క్యాంటీన్, మటన్ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలంగాణ రాష్ట్ర మేకలు, గొర్రెల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం మాసబ్‌ట్యాంక్‌లో మటన్ క్యాంటీన్ ప్రారంభించేందుకు ఏర్పాట్లను పరిశీలించి సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మటన్ మార్కెట్‌ను కూడా అక్కడే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



వైభవంగా అమ్మవారి కల్యాణోత్సవం

యాకుత్‌పురా: ఈస్ట్ చంద్రానగర్‌లోని మైసమ్మ ఆలయంలో అమ్మవారి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రచారి, రమేష్ దంపతులచే వేద పండితులు అమ్మవారి కల్యాణోత్సం జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్, టీపీసీసీ కార్యదర్శి నర్సింగ్‌రావు, వైస్ చైర్మన్ నరేష్‌కుమార్, కిషోర్ ప్రసాద్, పురుషోత్తం, రాజేష్, శివరాం పర్యవేక్షించారు.



కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శశికళ కృష్ణ

లోధ్ కులస్తుల సంక్షేమానికి కృషి

అబిడ్స్: లోధ్ కులస్తుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట గంగాబౌలిలో మాజీ ముఖ్యమంత్రి, లోధ్‌రత్న కల్యాణ్‌సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ.. లోధ్‌కులస్తుల సంక్షేమానికి, లోధ్‌కులస్తుల అభివృద్ధిలో కల్యాణ్‌సింగ్ చేసిన కృషి అమోగమని కొనియాడారు. లోధ్‌కులస్తుల సంక్షేమానికి తాను ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ

గోల్కొండ: ప్రధాని నరేంద్రమోదీ తన 9 ఏళ్ల పాలనలో దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంతో పాటు ఆర్థిక రంగాన్ని కూడా బలియమైన శక్తిగా తయారు చేశారని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. సోమవారం బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆయన ఆధ్వర్యంలో పద్మనాభనగర్ కాలనీ, దస్తగిరి కాలనీలలో ఇంటింటికీ తిరిగి ప్రధాని మోదీ విజయాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధీరజ్, అశ్విన్, ప్రభు పూజారి, సరిత తదితరులున్నారు.



ప్రత్యేక పూజలు



లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవాలతో పాటు నగరంలో, రాష్ట్రంలో బోనాలు విజయవంతంగా పూర్తి కావాలంటూ గండిమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్‌యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, నాయకులు ఈ పూజలు జరిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా వివిధ అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గండి మైసమ్మ ఆలయంలో నిర్వహించిన పూజల్లో వసంత్‌రెడ్డి, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.